# జాతక సెక్రం

కొందురు పట్టుకుణ్ణిందంతా బంగారయితింది. కొందురట్లా తాకతానే తగరం అయితింది. ఇంక కొందురుంటారు. చెయ్యెత్తితే చాలు. ముట్టుకోకుండానే మట్టి అయి పోతింది.

మట్టి! కొందురి చేతులకట్లా కమ్మన్నా కానేకాదు. ఒంటికట్లా సెగతగలదు. చెమటపట్టమన్నా పట్టదు. కట్టుకున్న గుడ్డ కరుకుమాయదు. పైగుడ్డట్లా నలగదు. అయినా వాళ్లబతుకులు మూడుపూలు! ఆరు కాయలు!

కొందురు పుట్టేది మట్టిలోనే. పెరిగేది మట్టిలోనే. పడేదీ ఆమట్టిలోనే. లేచేదీ ఆ మట్టిలోనే. కడాన కాలాడినా చెయ్యాడినా ఆమట్టిలోనే. అయినా నోటికీ చేతికీ ఆడేదే గెగనం!

పడేవాళ్లు పలుబాట్లు పడ్తానే వుండారు. చూసేవాళ్లు చూస్తానే వుండారు. నవ్వేవాళ్లు నవ్వతానే వుండారు. అయ్యోమంటానే వాళ్ల బుజాలమింది కెక్కి పైకి... యింకా పైపైకి పొయ్యేవాళ్లు పోతానే వుండారు.

'' ఏందిది? అరుసోద్దెంగా ఉండాదే? దీనంతుతేల్సుకోవాల్సిందే?'' అనుకుణ్ణె పెదపెద్దోళ్ల ఉచ్చిమింద బొచ్చు రాలిపోతావుండాది. కోడిగుడ్లు వాళ్ల తలకాయిల్ను ఎక్కిరిస్తా వుండాయి. వాళ్లబతుకుల్లో పొద్దువాలిపోతావుండాది.

ఈకతలు ఎత్తుకోని ఏ శాస్త్రికాడికో శర్మదగ్గిరికో పాయ్ తాంబూళంలో దచ్చినగూడాపెట్టి అడిగితే అడిగినోణ్ణి ఎగాదిగా చూసి ఒక ఎర్రి నవ్వు నవ్వి ' ఎవుడి జాతకబలం వాడిది పోరా ఎర్రోడా?' అంటాడు నీళ్లు తాగినంత సలీసుగా.

అంతే గదా మరి? తిరపతిలో ఎన్ని మండపాలుండేది? గోయిందరాజుల గుళ్లో అయితే అడుగుకొక్క మండపం. అదే రాములవారి గుడికాడైతే గుడిచుట్టూ మండపాలే. ఆడికే అయిపాయిందా? తూరుపుగా పారేడుమండపం. దచ్చినంగా దొంగలమండపం. మంచి సెంటర్లోనే తలా ఒక చెయ్యేస్తే ఎవుడి చేతిలోనో త్యాగరాజమండపం. ఇంక ఏడుకొండల మిందంటావా? ఏకంగా వెయ్యిగాళ్ల మండపం!!

ఇన్ని మండపాలు ఉండాయి గదా ఊళ్లో? వీటన్నిటికీ రాని పేరు ఒక్క నాలుగ్గాళ్లమండపానికే ఎట్టొచ్చిందబ్బా అంటే? అదే దాని జాతకబలం.

అప్పుడెప్పుడో మహన్నబావుడు రామానుజాచార్లు రొండు శ్రీ సెక్రాలు తయారుచేసి నాడంట. ఒకటి దనాకర్షణ కంట. ఇంగొగటి జనాకర్షణ కంట. జాతక బలం కాకుండాపోతే అవ్వి పెట్టేటప్పుడే తారుమారు కావాల్నా? ఎంకన్న దుడ్లు ఎంచుకోలేకుండా సంచుల్లో మూలగతా ఉండాయి. శివన్న శివుడా! అని పడుండాడు. దీన్ని ఏమనాల? జాతకబలం అనాల్సిందేగదా?

నాలుగ్గాళ్లమండపం కట్టినప్పుడు ఎవురు ఏసెక్రం పెట్నారో ఏమోగానీ పెట్టినోడి పేరులే. కట్టినోడి పేరులే. నాలుగ్గాళ్లమండపం పేరు మాత్రం నలుగురి నోళ్లల్లో నాన్తా ఉండాది.

నా వయసు యిప్పుడు యాభైకి పైబడింది. మాయమ్మకు అంతకంత పైబడి రొండోమూడో కొసురు. 'యవ్వా! యవ్వా! నాలుగ్గాళ్లమండపం ఎప్పిట్నుంచి ఉండాదమ్మా?' అని అడిగితే ' ఓ యబ్బా! మన అబ్బబ్బల కాలాన్నుంచి ఉండాడాదిరా?' అంటింది..

ఎవురుకట్నారో? ఎప్పుడు కట్నారో? ఎందుకుకట్నారో? అదొక ఎర్రికాలం. పున్నెం మూటగట్టుకోని పోవాలను కున్నారే కానీ పేరు మూటగట్టు కోవాలనుకోలా. అదే యిప్పుడైతేనా? నలుగురు నడ్సేదోవ పక్కన ఒక సపారి ఏస్తారు. ఆ సపార్లో సలింద్రం పెట్తారు. సలింద్రంలో కుండలు పగిలిపాయ్‌నా సరే. పెంకుల మిందన్నా పేరు కనబడాలని తాపేత్రపడతారు. నాలుగ్గాళ్ల మండపం కత అట్టా కాకపాయనే. ఈచేత్తో చేస్తే ఆ చేతికి తెలవగూడదనే ఎర్రిజనం కట్టించిన మండపం గదా నాలుగ్గాళ్లమండప మంటే!

జాతోడి కాలాన ఈ ఊళ్లమింద పెత్తనమంతా పాళేగాళ్ల శాతల్లోనే ఉండేదంట. ఆమొగలాయిలు వచ్చి యిట్టాంటి మండపాల్లోనే టికాణా యేసేవాళ్లంట. కాలిమింద కాలేసి కూసోని మీసాలు వడేస్తా మండపం ముందర్నే నిలబెట్టి కత్తులు గొంతలమింద పెట్టి కిస్తీరూకలు కక్కించే వాళ్లంట!

''ఇదెంతా వొట్టి జల్లి మాటల్రా! దేవుళ్లు దిగేదానికి కట్టించిన మండపాలు గదా యివ్వి.'' అని కొందురు అంటారు.

అది అంతేలే! ఒకరట్టా యింకొకరిట్టా అనకుండాపోతే ఈళ్లు మణుసులెట్టవతారు! ఇది లోకం ఎట్టయితిందిలే కానీ- ఆ పాలేగాళ్లు పాయ్‌నారు. మూటాముల్లె సర్దుకోవాల్సిన కాడికి సర్దుకోని తెల్లోళ్లు పాయ్‌నారు. దేముళ్ల సాచ్చిగా మన రాజ్జిం మన చేతి కొచ్చేసింది. చేతులు మారేటప్పుడు శాతొచ్చినోడంతా చేతికందిన కాడికి మట్టసంగా అదుంకున్నారు. ఎవుడెవుడు? ఎంతెంత? ఎట్టెట్ట? అదుంకున్నారంటే అది మంగలిదిబ్బలో చెయ్యి పెట్నెట్టేగదా? గెలిగేకుందికి శానాశానా కతలు బయటపడ్తాయ్. అదెంతా యిప్పుడు ఎందుకు గానీ నాలుగ్గాళ్లమండపం మాత్రం చిక్కంలో సంగటి ముద్ద అమిరినట్టు ఈ ఊళ్లో ఆచార్ల చేతుల్లో యిమిడి పాయ్యుండాది.

ఈ ఆచార్లు ఉండారే? బంగారి పనిచేసే వాళ్లుగదా? శానా జాగర్త మణుసులు. నోరుతెరిస్తే బంగారు పాలుకులు రాల్నెట్టేగదా పలుకులు! ఎదా? ఈ వారకంటికి తెలవకుండా ఆవారకంట్లో పాపను కత్తించాలంటే దానికెంత బాగోతం? మొనగోళ్లట్ట గాదే? కండ్ల ముందరే కంట్లో పాపను కత్తరించి పారేస్తారు. అవును. ఆ పని చేసే వాళ్లే ఆపని చెయ్యాల!

బోగం యీది కొళ్లబోతా వుంటే బోడిసన్నాసులంతా ఎగబెట్టుకోని పరిగెత్తినట్టు ఊరికేవస్తే ఊరికన్నంతా దానిమిందే నంట. తాడూ తగరాదలేదని ఈ మండపంమింద ఎప్పుడుపడిందో ఆచార్లకన్ను పడింది. వాళ్లు జాగర్తగా ఒక ఎత్తెత్తినారు. దొరలైనా దొంగలైనా ఈ దేశింలో దేముడి పేరుచెప్తే యింక నోరెత్తరని యాడాది కొకసారి దేముణ్ణి ఆ మండపంలో యేంచేపు చెయ్‌పిస్తా ఉండారు. ఉత్తుత్త మాటల్తో అనుకుండేరు. అయినకాడికి దుడ్డిచ్చి!

లంచం యిస్తేగానీ మంచం ఎక్కనన్నెట్టు ఆ దేముడు గూడా గుంజుకోవాల్సిన కాడికి గుంజుకోని యాడాది కొకసారంటే వొగిటేసారి ఆ మండపానికి యేంచేపు చేస్తాడు. ఒకప్పుడు పాళేగాళ్లు కొలువు దీరినట్టు కొలువు తీర్తాడు. ఎంత సేపు? రొంతసేపే! లేచి పోతాపోతా..

''ఒరే నాయనలారా! ఈ మాత్రం పుణ్ణానికి యాడాది పొడగనా దీన్ని మూసి పెట్టేది ఎందుకురా? మూసి పెట్టే పాసిపోతింది. బాడిగలకన్నా యిచ్చి బతుక్కోండిరా!'' అని చెవ్వు కొరికేసి పొయ్యేటట్టుగా ఉండాది.

బాడిక్కి యిచ్చినోడు తీసుకుణ్ణోడు యిద్దురూ బెమ్మాండంగా బతికిపోతా ఉండారు.

ఈడ్సి కొలిస్తే యిట్టబారడు అట్టబారడు ఉండదే? నాలుగ్గాదు. నలబైకాళ్లేవన్నా ఉండాయా? అంటే లేవే! పోనీ గోయిందరాజుల గుడి గోపరం ఎత్తయినా ఉండాదా? అంటే లేదే! మరి ఎట్టా వచ్చిందబ్బా దీని కింత పేరు?

దర్మం నిలబడుకోని ఉండేది నాలుగు పాదాల మింద!

ఈ మండపం నిలబడుకోని ఉండేది నాలుగ్గాళ్ల మింద!

అటుమంటి దర్మకాలాన కట్నారేమో!

ఉండచ్చు. లేకుండా పోతే మణుసులే కాదు ఆ మణుసులు నమ్ముకున్నదేముళ్లు గూడా ఆడికిరాకుండా తప్పించుపోని పొయ్యేదానికి లేదే!

ఏడుకొండలమింద ఎంకన్న. వాడొక ఎర్రిబాగలోడు. లేకుండాపోతే పెండ్లాం కాపరానికి వస్తావస్తా ఒక కరేపాకుమండ తేలేదని కన్నెర్ర చేస్తాడా? కాపరానికి తగవు పో అంటాడా? వాడే అట్టంటే యింక ఈ కాలం వాళ్ల కతలు ఎందుకులే? కడుపుచించుకుంటే కాళ్లకాణ్ణే గదా పడేది?

మన దర్మ పెబువులు గూడా ఏమి యిచ్చి ఏమి యియ్యకుండా పాయ్‌నా పచ్చుకారడ్ల మింద కిర్సనాలు యిస్తా ఉండారు. అడక్కుండా పాయ్‌నా అగ్గిపెట్టెలు అంటగడ్తా ఉండారు. అంత కిర్సనాలు. ఒక్క అగ్గిపుల్ల. చాల్సాలు. ఆడదాన్ని బూడిది చేసే దానికి ఆమాత్రం చాలు!

''సరే! జరిగిందేదో జరిగిపొయ్యింది. నీ దోవనీది. అమ్మదోవ అమ్మదయింది. ఇట్టయితే ఎట్టయ్యా? ఇదేంబాగలేదయ్యా! మీ కతలే యిట్టుంటే యింక మాకతలు ఎట్టుంటాయి? ఇంక జరగాల్సిన పని చూడండయ్యా!'' అని ఎవురు ఏయాళకాడ చెవ్వు కొరికినారో లేదు అయ్యగారికే నరాలు జివ్వుమన్నాయో? దేవుళ్లకత మనకు ఎట్టా తెలిస్తింది లే!

'సమత్సరానికి ఒక్కతూరి మాత్రం వస్తాన్లే' అన్నాడంట.

ఆమాట నిలబెట్టుకుంటా ఉండాడు.

యాడాది కొకతూరి అంటే ఎప్పుడు? కార్తీకినెల్లో పంచమినాడు. ఆపొద్దు మొనగోడు శానా పటాటోపంగా ఎలబార్తాళ్లే! చీరాసారె తీసుకుంటాడు. ఏకంగా ఏనిగమిందనే ఎక్కుంటాడు. చిత్తానూరికి పోతా పోతా నాలుగ్గాళ్లమండపాన్ని చూసుకోనేగదా పొయ్యేది.

దేవుడి సుబకార్నాలేగాదు. ఊళ్లో ఏయింట్లో ఏసుబకార్నం జరిగినా నాలుగ్గాళ్లమండపాన్ని తెచ్చి నట్టింట పెట్టుకోవాల్సిందే. గుడ్డాగుసురు కొనుక్కోవాలను కుణ్ణా.. కాయగసురూ తెచ్చుకోవాలను కుణ్ణా కడాన పప్పులోకంత ఉప్పు కావాలనుకుణ్ణా నాలుగ్గాళ్లమండపం గాలి తగలాల్సిందే! అది ఏమోగానీ ఆమండపం గాలి తగలకుండా పోతే ఆ పొద్దంతా అదొకమాదిరిగ ఏందో దారబోసుకుణ్ణెట్టుగానే ఉంటింది.

దేముడు వాహనమెక్కినా ఆడికి రావాల్సిందే!

మణిసి నాలుగ్గాళ్ల సవారి ఎక్కినా ఆదోవన పోవాల్సిందే!!

ఏందబ్బా ఈడు? ఎంతసేపు దీన్ని పట్టుకోని ఊగులాడ్తా ఉండాడే. ఇచ్చిత్రం

పచ్చిపుల్సు యీగిలు తాళింపు అన్నెట్టుండాదే య్వార్వం. అనుకుంటా ఉండారేమో? ఏం చెయ్‌మంటారు చెప్పండి. కోనేటి కట్ట సందులో ఎవురిదైనా కోడిపెట్ట దారపాయ్‌నా... కొర్లగుంట కొళ్ళుబొయ్‌నా... పర్నాలయీాదిలో పర్సోడి పర్సు ఎవుడైనా కొట్టేసినా... కస్తూరిబాయి సందులో సగం రేత్రి కాడ కస్తూరి యింటి తలుపు ఎవురు తట్నా... తెల్లారేకాడికి నాలుగ్గాళ్లమండపం కాడ నలుగురి నోట్లోనాన్తా ఉంటింది.

అదెట్రా అంటే?

తెల్లారే కాడికి యాడజనం ఆడ చేరిపోతారు. కుశాలకు చేర్తారా అంటే కాదు. కడుపులు చేత పట్టుకోనే వస్తారు.కడుపుల్లో ఉండేదంతా ఆడ కక్కేస్తారు.

ఇట్టా మాదిర ఆలోచించుకుంటా నాలుగ్గాళ్లమండపం కాడ నిలబడుకోనుంటే ఆడికి ముత్తారెడ్డన్న వచ్చె.

'ఏందిరా అబ్బోడా! చూపంతా నాలుగ్గాళ్లమండపం మిందనే ఉండాదే?' అని అడిగె.

'చూపు వొగిటే కాదన్నా! ఆలోచిన్లన్నీ దాని మిందనే పారకలాడ్తా ఉండాయి. ఇట్ట జానడు అట్ట జానడు లేదు. దీనికి ఎట్టొచ్చిందన్నా యింత పేరు?' అని అడిగితే-

''ఒరే నాయినా! రావాల్సిన సందేహమే వచ్చిందిరా. చెప్తాయిను. శ్రీరామచంద్రుడు వారాది కట్తా ఉణ్ణాడా? కొండలు మోసినోళ్లుండారు. బండలు మోసినోళ్లుండారు. ఎవురి కొచ్చిందిరా పేరు? ఇసికిలో అట్టా యిట్టా పొల్లాడేసి వచ్చిన ఉడతకు గదరా పేరొచ్చింది. అది ఆడికయ్యిందా? అడవుల్లో సింగాలుంటాయి. పులులుంటాయి. ఏనిగలుంటాయి. ఇంకా ఎన్నెన్నో జీవరాసులుంటాయి. నక్కబావ మింద వచ్చినన్ని కతలు యింక దేని మిందన్నా వచ్చినాయా? అదంతేరా! దేని జాతకసెక్రం దానిదేరా!'' అనె.

అవును! వాడెవుడన్నా సరే నాలుగువమాటలు అనాలన్నా యినాలన్నా యినిపించుకోవాలన్నా నాలుగ్గాళ్లమండపం కాడ చేరాల్సిందే. దాని జాతకబలం అట్టుంటే ఎవుడు మాత్రం ఏం చేస్తాళ్లే!. ●